TELUGU & ENGLISH డిజిటల్ మీడియా | FAST NEWS | VIDEO NEWS | e-PAPER | DIGITAL SERVICES • 24/7

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం ... 24/7 ప్రజా సేవలో...

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

epaper,www.tmedia.net.in | YouTube | facebook

మంగళవారం 03/11/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

టీటీడీకి స్పెసిఫైడ్ అథారిటీ

(మిగతా 2లో)

చైర్మన్‌గా ఈవో ముద్దాడ రవిచంద్ర



రోడ్డు నిర్మాణ పనుల్లో విద్యుదాఘాతం..



⏭ 8 మంది కూలీలు మృతి

⏭ హైటెన్షన్ తీగలకు తగిలిన నిర్మాణ యంత్రం

టీ మీడియా, నవంబర్ 2 , ఝుంఝునూ:
రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఝుంఝునూ జిల్లాలోని ఉదయ్‌పుర్‌వాటి ప్రాంతం ఛాపోలీ గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది.

అధికారుల వివరాల ప్రకారం.. గ్రామస్థుల సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కంకర కలిపేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కదమ్ కుండ్ వైపు వెళ్లే రహదారిపై పనులు జరుగుతుండగా, యంత్రం పైన ఉన్న 11 వేల వోల్టుల సామర్థ్యం కలిగిన హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో యంత్రంలోకి ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించింది. సమీపంలో పనిచేస్తున్న కార్మికులు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. ప్రమాద తీవ్రతకు అక్కడున్నవారు తేరుకునేలోపే పలువురు ప్రాణాలు కోల్పోయారు.

ఘటనా స్థలంలో ఐదుగురి మృతి

ప్రమాద సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సహాయక (మిగతా 2లో)

చెత్త కనిపించకూడదు, ట్రాఫిక్ ఆగకూడదు

నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు : సీఎం వార్నింగ్



టీ మీడియా, నవంబర్ 2,హైదరాబాద్ బ్యూరో :
హైదరాబాద్‌ను 'క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. క్యూర్ పరిధిలోని మూడు కమిషనరేట్?లలో గ్రీన్ ట్యాంకర్ల సరఫరా పెంచాలన్నారు. జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ జామ్?లు లేకుండా సిగ్నల్ రహిత జంక్షన్?లకు ప్రణాళిక చేయాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఇండస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు పారిశ్రామిక వాడల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్?తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో గ్రీన్ ట్యాంకర్స్?ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు.

గ్రీన్ వాటర్ సరఫరా మరింత విస్తరించాలి

నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. జలమండలి తొలివిడతలో 19 ఎస్టీపీ నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థకు ప్రణాళికలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన (మిగతా 2లో)

లాలూను కలిసిన సోనియా గాంధీ..



⏭ యూపీఏ పాలన గుర్తు చేసుకున్న నేతలు

టీ మీడియా, నవంబర్ 2, న్యూఢిల్లీ:
ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ కలిశారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే యూపీఏ పాలన, విధానాలను గుర్తు చేసుకున్నట్లు వారు వెల్లడించారు. సోమవారం ఢిల్లీలోని ఆర్జేడీ ఎంపీ మీసా భారతి నివాసంలో లాలూను సోనియా గాంధీ కలిశారు. ఈ విషయాన్ని ఎక్స్ పోస్ట్ ద్వారా లాలూ తెలిపారు. 'గౌరవనీయులైన సోనియా గాంధీ మా నివాసానికి వచ్చి, నా ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత రోజులకు సంబంధించిన జ్ఞాపకాలు మళ్ళీ గుర్తుకొచ్చాయి' అని పేర్కొన్నారు.కాగా, యూపీఏ ప్రభుత్వ హయాంలో యువత, రైతులు, సైనికులు, సామాన్యుల కోసం పారదర్శకమైన ప్రజా సంక్షేమ పథకాలను తాము అమలు చేశామని లాలూ ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ, ఆర్‌టీఈ, ఆర్‌టీఐ వంటి చట్టాల ద్వారా దేశ ప్రజలను శక్తివంతులను చేశామని ఆయన గుర్తు చేశారు. 'మన్మోహన్ సింగ్ నాయకత్వంలో బీహార్ అభివృద్ధి కోసం లక్షా నలభై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను మేం అందించాం' అని ఆ పోస్ట్‌లో లాలూ పేర్కొన్నారు.మరోవైపు ఆర్జేడీ నేత, లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులు (మిగతా 2లో)

మీసేవ హార్డ్ కాపీల వెనుక 'వసూళ్లే' దందా!



⏭ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

⏭ డిజిటల్ పాలనలోనూ పాత పద్ధతులా?

టీ మీడియా, నవంబర్ 2,హైదరాబాద్ బ్యూరో:
ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభతరం చేయాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మీసేవ వ్యవస్థలో కొన్ని చోట్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసినప్పటికీ మళ్లీ హార్డ్ కాపీలతో తహసీల్దార్ (మిగతా 2లో)

మురసును సమర్థంగా ఎదుర్కొందాం

అధికార యంత్రాంగానికి సీఎం దిశానిర్దేశం

టీ మీడియా, నవంబర్ 2,అమరావతి బ్యూరో:
పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను 'మురసు' తీవ్ర తుపానుగా బలపడి తీరం వైపు దూసుకొస్తోంది. గత 6 గంటల్లో గంటకు 22 కి.మీ వేగంతో కదిలినట్లు వాతావరణశాఖ తెలిపింది. తుపాను ప్రభావంతో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.రాష్ట్రంపై మురసు తుపాను ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మురసు తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని, తుపాను వర్షాలను నీటి వనరుల పెంపునకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ నుంచి అధికారులు, కలెక్టర్లతో తుపాను సన్నద్ధతపై సమీక్షించారు. దక్షిణ కోస్తాంధ్ర నుంచి దిగువ జిల్లాలు, రాయలసీమలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే



సూచనలున్నాయని అధికారులు సీఎంకు ప్రాజెక్టుల పరిధిలో 30 నుంచి 50 టీఎంసీల వివరించారు. నాగార్జునసాగర్, పులిచింతల వరకు నీటి ప్రవాహాలు (మిగతా 2లో)

ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధం

⏭ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సవాల్

టీ మీడియా, నవంబర్ 2,హైదరాబాద్ బ్యూరో :
ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధమని, హైదరాబాద్ నుంచి సవాల్ విసురుతున్నానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈవీఎంల ద్వారా తాము గెలిస్తే తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బచావో ర్యాలీలపై అమిత్ షా విమర్శలు (మిగతా 2లో)



జాయింట్ సర్వేను స్వయంగా పర్యవేక్షిస్తా

⏭ మంత్రి పొంగులేటి

టీ మీడియా, నవంబర్ 2,హైదరాబాద్ బ్యూరో:
రాష్ట్రంలో రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారాలు తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. (మిగతా 2లో)



మీసేవ హార్డ్ కాపీల వెనుక 'వసూళ్లే' దందా!

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాలకు రావాలని కోరుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ అదనపు ప్రక్రియ వెనుక మధ్యవర్తుల ప్రమేయం, అనధికార వసూళ్లకు అవకాశం కలుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా ..

డిజిటల్ సేవల అమలులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం 2018 ఫిబ్రవరి 12న జి ఓ నెంబర్.3 జారీ చేసింది. టి ఆప్ ద్వారా అందిన పౌరుల దరఖాస్తులకు సంబంధించి దరఖాస్తు ఫారం, ఆధార పత్రాల హార్డ్ కాపీలను ప్రభుత్వ శాఖలు అడగకూడదని ఈ ఉత్తర్వులో స్పష్టం చేసింది. డిజిటల్ రసీదులను కూడా సంబంధిత అవసరాలకు గుర్తించాలని ఆదేశించింది.మరోవైపు, మీసేవ దరఖాస్తుల భౌతిక ప్రతుల సమర్పణపై తహసీల్దార్లు పట్టుబడుతున్న అంశాన్ని తెలంగాణ మీసేవ ఫెడరేషన్ కూడా ప్రస్తావించింది. 2018 ఏప్రిల్ 24న ఎల్ఆర్నెంబర్.1033/ ఈ ఎస్ డి/=వజవఅబవ/2014 ద్వారా జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన లేఖను ఈ వివాదానికి సంబంధించిన ముఖ్యమైన ఆధారంగా పేర్కొంటోంది. ఈ అంశంపై హైకోర్టు ఆదేశాలు కూడా ఉన్నట్లు ఫెడరేషన్ వెల్లడించింది.

హార్డ్ కాపీల పేరుతో అదనపు ఖర్చులు!

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పత్రాలనే మళ్లీ జిరాక్స్ తీసి కార్యాలయాలకు అందించాల్సి వస్తే ప్రజలకు అదనపు ఖర్చుతో పాటు సమయం కూడా వృథా అవుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే పేదలు, విద్యార్థులు, వృద్ధులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఆన్‌లైన్‌లో ఉన్న పత్రాలను అధికారులు స్వయంగా పరిశీలించలేరా? తప్పనిసరిగా హార్డ్ కాపీలు అవసరమైతే అందుకు సంబంధించిన నిబంధనను ఎందుకు చూపడం లేదు? పత్రాల సమర్పణ పేరుతో మధ్యవర్తులు రంగంలోకి దిగుతున్నారా?



దరఖాస్తుల ఆమోదం త్వరగా కావాలంటే అదనపు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఎక్కడైనా ఉందా?

వరంగల్‌లోనూ విద్యార్థుల ఫిర్యాదులు!

వరంగల్‌కు చెందిన విద్యార్థి కుల, ఆదాయ, ఓబీసీ సర్టిఫికెట్ల కోసం మీసేవలో దరఖాస్తు చేసినప్పటికీ హార్డ్ కాపీలను ఎంఆర్ఓ కార్యాలయంలో సమర్పించాలని కోరినట్లు వెల్లడించాడు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, కొన్ని సందర్భాల్లో మధ్యవర్తులకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందని అతను ఆరోపించినట్లు ఆ కథనం పేర్కొంది. వరంగల్, హనుమకొండ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరని, సిబ్బంది కొరత, అధిక సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌కు కారణమవుతున్నాయని వివరించారు. అంటే అధికారుల వివరణలో విచారణ అవసరం ఒక అంశమైతే, దరఖాస్తుదారుల ఆరోపణల్లో ఆలస్యం, మధ్యవర్తుల ప్రమేయం మరో అంశంగా కనిపిస్తున్నాయి.

ఏసీబీ తనిఖీలు.. అక్రమాలు వెలుగులోకి!

2026 ఏప్రిల్ 16న రాష్ట్రవ్యాప్తంగా 13 మీసేవ కేంద్రాల్లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. అధిక వసూళ్లు, అనధికార మధ్యవర్తులు, పత్రాల అక్రమాలపై తనిఖీల్లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ తనిఖీల్లో వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని కేంద్రాలు కూడా ఉన్నాయి. కొన్ని కేంద్రాల్లో నిర్ణీత రుసుముల కంటే అధికంగా వసూలు చేసినట్లు, అనధికార వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది.ఈ తనిఖీల్లో బయటపడిన అక్రమాలు హార్డ్ కాపీల డిమాండ్ వల్లే జరిగాయని నిర్ధారణ కాలేదు. అయినప్పటికీ మీసేవ సేవల్లో పారదర్శకత, రుసుముల నియంత్రణ, మధ్యవర్తుల నిరోధంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి.

నాలుగు సర్టిఫికెట్లు.. ఒకే విధానమా?

కులం, ఆదాయం, నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలకు ఒకే విధమైన ప్రక్రియ ఉండదు. కొన్ని సేవల్లో డిజిటల్ డేటా ఆధారంగా ధ్రువీకరణ సాధ్యమవుతుంది. మరికొన్ని సేవల్లో క్షేత్రస్థాయి విచారణ, అదనపు ఆధారాల పరిశీలన అవసరమవుతుంది.అయితే విచారణ అవసరమనే కారణంతో ప్రతి దరఖాస్తుదారుడిని మళ్లీ మళ్లీ కార్యాలయాలకు పిలవడం సమర్థనీయం కాదు. ఏ పత్రం ఎందుకు కావాలో, ఏ నిబంధన ప్రకారం కావాలో స్పష్టంగా తెలియజేయాలి. అదనపు రుసుములు వసూలు చేస్తే అధికారిక రసీదు ఇవ్వాలి.

టీటీడీకి స్పెసిఫైడ్ అథారిటీ

● **చైర్మన్‌గా ఈవో ముద్దాడ రవిచంద్ర**

టీ మీడియా, నవంబర్ 2 , తిరుమల :

టీటీడీ పాలకమండలి గడువు ముగియడంతో ప్రభుత్వం స్పెసిఫైడ్ అథారిటీని నియమించింది. ఈవో ముద్దాడ రవిచంద్ర చైర్మన్‌గా, ఇద్దరు ఐఏఎస్ అధికారులు సభ్యులుగా ఉత్తర్వులు జారీ చేసింది.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాలనలో ఎలాంటి అంతరాయం కలగకుండా టీటీడీకి 'స్పెసిఫైడ్ అథారిటీ'ని నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రెవెన్యూ (దేవాదాయ) శాఖ కార్యదర్శి ఈ మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 658 విడుదల చేశారు. 1987 దేవాదాయ చట్టంలోని సెక్షన్ 137 ప్రకారం ఈ నియామకం చేపట్టినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.నూతనంగా నియమించిన ఈ స్పెసిఫైడ్ అథారిటీకి టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) ముద్దాడ రవిచంద్ర చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్థిక శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబులను ఇందులో సభ్యులుగా నియమించారు. ఈ అథారిటీ పదవీకాలం ఏడాది పాటు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకవేళ ఈలోపు కొత్త ట్రస్ట్ బోర్డును నియమిస్తే, వెంటనే ఈ స్పెసిఫైడ్ అథారిటీ రద్దవుతుందని ఉత్తర్వుల్లో వివరించింది. అలాగే, ట్రస్ట్ బోర్డుకు ఉండే అధికారాలు, విధులు అన్నీ ఈ స్పెసిఫైడ్ అథారిటీకి ఉంటాయని స్పష్టం చేసింది.గతంలో 2024 నవంబర్ 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం టీటీడీ పాలకమండలిని ఏర్పాటు చేసింది. బీఆర్ నాయుడు చైర్మన్‌గా మొత్తం 29 మంది సభ్యులతో ట్రస్ట్ బోర్డును నియమించింది. కాగా, వారి పదవీకాలం 2026 అక్టోబర్ 31తో ముగిసింది. గడువు ముగియడంతో బోర్డు స్థానంలో ప్రభుత్వం తక్షణమే ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులతో స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

రోడ్డు నిర్మాణ పనుల్లో విద్యుదాఘాతం..

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు చేపట్టి బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఝుంఝునూ జిల్లా కలెక్టర్ అరుణ్ గార్గ్ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ షాక్‌కు గురైన ఐదుగురు కార్మికులు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. మరో ఆరుగురిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురు మరణించారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ ఘటనా స్థలానికి బయలుదేరారు. స్థానిక ఎమ్మెల్యే భగవానారామ్ సైనీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులను పరామర్శించేందుకు బయలుదేరినట్లు తెలిపారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

చెత్త కనిపించకూడదు, ట్రాఫిక్ ఆగకూడదు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, జి. సృజన, తదితరులు పాల్గొన్నారు.

లాలూను కలిసిన సోనియా గాంధీ..

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఈ సందర్భంగా అక్కడ ఉన్నారు. సాధారణ వైద్య పరీక్షల కోసం లాలూ ఢిల్లీకి వచ్చినట్లు తేజస్వీ యాదవ్ తెలిపారు. 'నిన్న నేను సోనియా జీని కలిసినప్పుడు ఈ విషయాన్ని ఆమెకు తెలియజేశా. ఆమె స్వయంగా లాలూ జీని కలవాలని కోరుకున్నారు. అందుకే ఈ రోజు ఆయనను పరామర్శించడానికి వచ్చారు' అని అన్నారు.అయితే తమ కుటుంబాల మధ్య చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తేజస్వీ యాదవ్ గుర్తు చేశారు.

మురసును సమర్థంగా ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే అవకాశం ఉందని తెలిపారు.అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి చాలా ప్రాంతాలు సాధారణ స్థితికి వచ్చాయని, మురసు ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని సీఎం స్పష్టం చేశారు. తుపాను గాలులతో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో 8 వేల వరకు విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మరోవైపు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ పరిధిలోని చెరువులు, రిజర్వాయర్లను సమర్థ నీటి నిర్వహణతో నింపాలని చంద్రబాబు ఆదేశించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమీక్ష

మురసు తుపాను నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్షించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని పవన్ అన్నారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

వాగులు, వంకల సమీపంలో జన సంచారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా సమన్వయం చేసుకోవాలి పవన్ దిశానిర్దేశం చేశారు. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ప్రజలకు సూచించారు.

జాయింట్ సర్వేను స్వయంగా పర్యవేక్షిస్తా

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదని రెండు విభాగాలు పూర్తి సమన్వయంతో జాయింట్ సర్వేలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని తెలిపారు. భూ వివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలని, ఆ సర్వేలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులు గుర్తించాలని సూచించారు.

జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం

ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీ భూములు ఉన్నాయని కొన్ని దశాబ్దాలుగా రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నాయని ప్రస్తావించారు. పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్ట్ భూముల మధ్య కూడా వివాదాలు ఉన్న దృష్ట్యా ఆయా అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలు సమగ్రంగా సరిపోల్చి వివాదాలకు తావులేకుండా స్పష్టమైన హద్దులు నిర్ధారించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం

ఈ సమస్యలను ఒక శాఖపై మరొక శాఖ బాధ్యతగా నెట్టివేసే ధోరణి విడనాడాలని, పరస్పర సమన్వయంతో పరిష్కార దిశగా అడుగులు వేయాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలు అక్కడే పరిష్కరించాలని, ఉన్నతస్థాయి నిర్ణయాలు అవసరమైన అంశాలు వెంటనే రాష్ట్రస్థాయికి నివేదించాలన్నారు.

రెండు శాఖల మధ్య సమన్వయం

ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగడం వల్ల రైతులు, భూయజమానులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో ప్రజలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా, వాస్తవ ఆధారాలతో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. ఇకపై రెవెన్యూ -- అటవీ భూ సరిహద్దు వివాదాల పరిష్కార ప్రక్రియసహా రెండు శాఖల మధ్య సమన్వయానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని పొంగులేటి పేర్కొన్నారు.

ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

గుప్పించారు. హైదరాబాద్‌లో పార్టీ నిర్వహించిన బీజేపీ మహాపాదయాత్రలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు.నిజాం కాలేజీ నుంచి ప్రారంభమైన ర్యాలీ మొజాంజాహీ మార్కెట్ వరకు సాగింది. కిలోమీటరున్నర దూరం పాదయాత్రలో అమిత్ షా ఉత్సాహంగా పాల్గొన్నారు. అడుగడుగునా కార్యకర్తలకు వందనం చేస్తూ, వారిని ఉత్సాహపరుస్తూ ముందుకు సాగారు. ఈ యాత్రలో అమిత్ షాతో పాటు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.మొజాంజాహీ మార్కెట్ వద్ద బీజేపీ బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ కాంగ్రెస్ తీరు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ సర్కారు రావాలా? వద్దా? అని కార్యకర్తలను అడిగారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారును గద్దె దించేందుకు సంకల్పం తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, అరాచకత్వాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. నిజాం మెడలను సర్దార్ పటేల్ వంచబట్టే హైదరాబాద్ విముక్తి పొందిందని గుర్తుచేశారు.

అప్పుడు ప్రధాని మోదీ గెలవలేదా?

కాంగ్రెస్‌ది ఓటు బచావో ర్యాలీ కాదని, చొరబాటుదారులను కాపాడే ర్యాలీ అని అమిత్ షా వ్యాఖ్యానించారు. రాహుల్, రేవంత్ రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వబోమని స్పష్టం చేశారు. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా? వద్దా?, ఓటరు జాబితాను ప్రక్షాళన చేయాలా? వద్దా?, కోటికి పైగా ఉన్న నకిలీ ఓట్లు తొలగించాలా? వద్దా? అని అమిత్ షా ప్రశ్నించారు.దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారనే ఆరోపణల్లో వాస్తవం లేదని, దేశంలో లేని వారి ఓట్లే 3 కోట్లకు పైగా ఉన్నాయని తెలిపారు. చొరబాటుదారులను భారత్ నుంచి పారద్రోలుతామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ వల్లే బీజేపీ గెలిచామని కాంగ్రెస్ ఆరోపిస్తోందని, అలా అయితే 2014, 2019లో ఎస్ఐఆర్ లేదని, అప్పుడు ప్రధాని మోదీ గెలవ లేదా అని ప్రశ్నించారు. కొన్నేళ్లుగా బీజేపీకి దేశంలో ఆదరణ పెరుగుతోందని వెల్లడించారు. త్వరలోనే భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మారుస్తానని స్పష్టం చేశారు. మాటిమాటికీ విదేశాలకు పారిపోయేవారు మనకు కావాలా? అని అడిగారు. తాము ఎప్పుడూ పేదలు, రైతులు, యువత పక్షమే ఉంటామని, తెలంగాణలో బీజేపీ సర్కార్ వచ్చేందుకు తమకు అండగా ఉండాలని కోరారు.

ఉచిత నట్టల నివారణ కార్యక్రమం



● **రైతుల ఇంటి ముంగిటకే పశువైద్య సేవలు**

టీ మీడియా, నవంబర్ 01,అశ్వాపురం:

అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కాలువ బజార్‌లో తెలంగాణ ప్రభుత్వం, పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ సిబ్బంది రైతుల ఇంటి ముంగిటకే వెళ్లి దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ రోజు మొత్తం 202 దూడలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగింది.చిన్న వయస్సులోనే దూడలకు నట్టల నివారణ మందులు వేయించడం వల్ల అవి ఆరోగ్యంగా పెరిగి, వాటి ఎదుగుదల మెరుగుపడుతుందని, భవిష్యత్తులో పాడి రైతులకు మంచి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని పశువైద్య అధికారులు వివరించారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మాట్లాడుతూ, రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదేవిధంగా, ఈ కార్యక్రమంలో ఇంకా నట్టల నివారణ మందులు వేయించుకోని రైతులు ఎవరైనా మిగిలి ఉంటే, వారు స్థానిక పశువుల ఆసుపత్రిని సందర్శించి తమ దూడలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక వెటర్నరీ డాక్టర్ ఫర్హానా బేగం, వారి సిబ్బంది, గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తుల్సూరి ప్రకాశరావు, వార్డు సభ్యులు చింతల అనుపమ, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రధాని సమావేశంలో పాల్గొన్న విద్యార్థి



టీ మీడియా,నవంబర్ 2 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం మోదితో గుజరాత్ పర్యటనకు జిల్లా నుంచి ఎంపిక అయిన ఐదుగురు విద్యార్థులు గుజరాత్ లో ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమశీలో బాగంగా ప్రధాని సమావేశంలో పాల్గొని స్టాట్యూ అఫ్ యూనిటీ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని సందర్శించిన ఐదు మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు అందులో పెబ్బేరు జిల్లా పరిషత్ హై స్కూల్ కు చెందిన విద్యార్థి క్రిష్ణ తో సహా ఐదు గురు విద్యార్థులు గుజరాత్ పర్యటన ముగించుకొని వచ్చిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ్రాతి నరసింహ గౌడ్ ఉపాధ్యాయులు విద్యార్థి క్రిష్ణ ను అభినందించారు.

ఎండుతున్న పంటలు

⏭ సాగునీరు అందక

రైతుల ఆవేదన



టీ మీడియా ,నవంబర్ 2 ,ఆత్మకూరు:
వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని కత్తెపల్లి గ్రామంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఒక్క ఎకరాకు కూడా పూర్తిస్థాయిలో సాగునీరు అందలేదని రైతులు వాపోతున్నారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు నీరు అందకపోవడంతో పంటలు రోజురోజుకూ ఎండిపోతున్నాయి. ఇప్పటికే పంటలు వాడిపోయి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని, మరో రోజు నీరు అందకపోతే పూర్తిగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫోన్ ద్వారా సమాచారం అందించినా, నీటి సరఫరా పెంచుతామని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం నీరు అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పంటలు ఎండిపోతున్న దృశ్యాలను ఫొటోల రూపంలో కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.సకాలంలో సాగునీరు అందకపోతే పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చివరకు పంటలను కాపాడుకోలేక గొర్రెలు, పశువులకు మేతగా వదిలేయాల్సిన దుస్థితి వస్తుందని వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కత్తెపల్లి గ్రామానికి తక్షణమే సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని, పంటలు ఎండిపోకుండా నీటి సరఫరాను పెంచాలని రైతులు ప్రభుత్వాన్ని, ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.

మనిషికి 12 కిలోల బియ్యం ఇవ్వాలి

⏭ వ్యకాస నేత కొండబోయిన

నాగేశ్వరరావు



టీ మీడియా,నవంబర్02,సింగరేణి(కారేపల్లి):
ఎల్‌నినో కరువు ప్రభావం,పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదల జీవనం ఇబ్బందికరంగా మారిందని,వారిని ఆదుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.సోమవారం కారేపల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ..కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ బియ్యం,నిత్యావసర సరుకుల ధరలను పెంచుతున్నారని ఆరోపించారు.ధరల పెరుగుదలను నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి దుకాణంలో సరుకుల ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.పేదలపై ధరల భారాన్ని తగ్గించేందుకు చౌకదుకాణాల ద్వారా ప్రతి మనిషికి నెలకు 12 కిలోల బియ్యం అందించాలని డిమాండ్ చేశారు.అలాగే వంటనూనె, కందిపప్పు,గోధుమలు,జొన్నలు,పంచదార,టీ పొడి,ఉప్పు, కారం, పసుపు,చింతపండు తదితర 14 రకాల నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని కోరారు.కరువు ప్రభావంతో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలని,కొలతలతో సంబంధం లేకుండా రోజువారీ కూలీగా రూ.800 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రుణ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడంతో పాటు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి పేదలు,రైతులు,వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ప్రజా వాణి సమాచారం పై స్పందించని ఎం పి డి వో

టీ మీడియా, నవంబర్ 2 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో ప్రజావాణి కి సంబంధించిన ఫిర్యాదులు పరిష్కారాలు పెండింగ్ వివరాలు అడగ్గా ఎం పి డి వో నుండి ఎలాంటి సమాచారం లేదు పత్రికా ప్రతినిధులకు సరైన సమాచారం అందించడం లేదనీ వాపోయారు. పలు సమస్యలపై ప్రజా వాణికి వచ్చిన ఫిర్యాదు దారులకు ఎంతవరకు న్యాయం చేస్తారని ప్రభుత్వ కార్యక్రమాలు పారదర్శకత పై ప్రజల్లోకి తీసుకువెళ్ళే పత్రికా ప్రతినిధులకు



సమాచారం అందించాలని ప్రభుత్వ ఉన్నత అదికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ప్రజలు పత్రికా ప్రతినిధులు కోరారు.

సేవాభావంతో ప్రగతి విద్యాలయం

టీ మీడియా, నవంబర్ 2 ,పెబ్బేరు:
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం లోని వై శాఖాపూర్ గ్రామంలోని ప్రగతి విద్యాలయం కీర్తి కిరీటంలో మరో కలికితురాయి.మారుమూల గ్రామీణ ప్రాంతంలో స్థాపించబడిన ప్రగతి విద్యాలయం అంచలంచెలుగా ఎదుగుతూ ఆకాశమంతా విస్తరించింది పాఠశాల జాతీయస్థాయిలోగుర్తింపబడివిజయాన్నిఅందుకుంది.పాఠశాల ప్రిన్సిపల్ రిజోబాబు డాక్టరేట్ అందుకొని పాఠశాల సాధించిన విజయాలకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా వెల్ ఎడ్యుకేషనల్ అండ్ పీస్ కౌన్సిల్ అనే ఎలాంటి లాభాపేక్ష లేని ఒక జాతీయస్థాయి ప్రాధాన్యత కలిగిన సంస్థగా పాఠశాల ప్రిన్సిపల్ రిజోబాబుకు డాక్టరేట్ పురస్కారం అందజేశారు
వెనకబడ్డ గ్రామీణ పేద విద్యార్థులకు



వికలాంగులకు తల్లిదండ్రులు లేని పిల్లలకు విద్యతో పాటు పిల్లలకు నైతిక విలువలు సమానత్వం శాంతియత జీవన విధానాలను నేర్పించే పాఠశాలలను వెల్ ఎడ్యుకేషనల్ అండ్ పీస్ కౌన్సిల్ సంస్థ ప్రత్యేకంగా గుర్తిస్తుందిసంస్థ ఉద్దేశ్యాలను పాటించడంలో మన పాఠశాల ముందు వరసలో ఉన్నందున మన పాఠశాలకు మన పాఠశాల ప్రిన్సిపాల్ కి ఇంతటి గౌరవం దక్కింది ప్రిన్సిపల్ డాక్టర్ రిజో బాబు పాఠశాల అభివృద్ధి విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో విశేషంగా కృషిచేశారు పాఠశాల పనివేళల్లో మాత్రమే పని చేయాలనే నిబందన లాంటిది ఏదీ పెట్టుకోకుండా నిరంతరం పాఠశాల అభివృద్ధి కోసంశ్రమించారు.విద్యార్థులు ఉపాధ్యాయులు క్రమశిక్షణ సమన్వయం పాటించేలా తీర్చిదిద్దారు పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకున్న పాఠశాలసిబ్బందికి విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు వై శాఖాపూర్ తోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

స్త్రీ నిధిలో రూ.25 లక్షల గోల్‌మాల్

⏭ సోషల్ ఆడిట్‌తో వెలుగులోకి.

టీ మీడియా, నవంబర్ 2 , ఏన్కూరు :
ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రేపల్లెవాడ గ్రామపంచాయతీలో స్త్రీ నిధి రుణాల చెల్లింపులకు సంబంధించిన నగదు వ్యవహారం కలకలం రేపుతోంది. మహిళా సంఘాల సభ్యులు నెలనెలా చెల్లించిన రుణ వాయిదాల సొమ్మును సంబంధిత ఖాతాల్లో జమ చేయకుండా, సుమారు రూ.25 లక్షలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు గ్రామ దీపిక రమాదేవి గ్రామసభలో అంగీకరించినట్లు సమాచారం. ఈ వ్యవహారం సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి రావడంతో మహిళా సంఘాల సభ్యుల్లో ఆందోళన నెలకొంది.స్త్రీ నిధి ద్వారా రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెలా తమ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నట్లు తెలిసింది. అయితే, సభ్యులు చెల్లించిన నగదు సంబంధిత ఖాతాల్లో జమ కాకపోవడంతో నిధుల లావాదేవీలపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో నగదు వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.ఈ అంశంపై సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సుమారు రూ.25 లక్షల నగదును వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు గ్రామ దీపిక రమాదేవి అంగీకరించినట్లు సమాచారం. మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్ము



వారి రుణ ఖాతాల్లో జమ కాకపోవడంపై గ్రామసభలో చర్చించినట్లు తెలిసింది.స్త్రీ నిధికి సంబంధించిన లావాదేవీల్లో ఎంత మొత్తం వసూలైంది? ఎంత మొత్తం సంబంధిత ఖాతాల్లో జమైంది? ఎంత మొత్తం వినియోగించారు? ప్రస్తుతం ఎంత బకాయి ఉంది? అనే అంశాలపై పూర్తిస్థాయి లెక్కలు తేల్చాల్సిన అవసరం ఉంది. మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్ముకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించి, వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.మహిళలు కష్టపడి సంపాదించిన సొమ్మును రుణ వాయిదాల రూపంలో చెల్లిస్తే, ఆ నగదు సక్రమంగా ఖాతాల్లో జమ కావాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, నిధుల వ్యవహారంలో బాధ్యులను గుర్తించడంతోపాటు, వినియోగించిన మొత్తాన్ని తిరిగి రాబట్టి మహిళా సంఘాల సభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.మహిళా సంఘాల సొమ్ముకు భద్రత కల్పించే విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.గ్రామసభలో పాల్గొన్నవారు స్త్రీ నిధి మేనేజర్ వేణుగోపాల చారి, రీజినల్ మేనేజర్ రవీందర్ నాయక్, ఏపీఎం , సీసీ లు, సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్, ఉపసర్పంచ్ కాళంగి వీరభద్రం, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎంఐఎం పార్టీ చేయూత

టీ మీడియా, నవంబర్ 2 ,ఆత్మకూరు:
పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, విద్యాపరంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ఎంఐఎం పార్టీ విద్యార్థులకు అండగా నిలిచింది. ఏఐఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీల నాయకత్వంలో సలారే మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా మోడల్ పేపర్లు, ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫంధి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుతూ, వార్షిక పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమై మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.ఆర్థిక పరిస్థితులతో సంబంధం



లేకుండా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యా సహకారం అందించా ఎంఐఎం పార్టీ, సలారే మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సేవలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఉర్దూ మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మదిలేటి, ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫంధి (హైదరాబాద్), ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జాబెర్ బిన్ అల్ జాబ్రీ, వనపర్తి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహీం, ఆత్మకూరు మండల అధ్యక్షులు నిరంజన్, పట్టణ అధ్యక్షులు ఇమ్రాన్, జనరల్ సెక్రటరీ జావిద్, ట్రెజరర్ ఫెరోజ్, ఖదీర్, ఫయాజ్, సమీర్, యూనుస్, రసూల్, షాకీర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ సాధిస్తాం

⏭ ఓటు నమోదులో ఉపాధ్యాయులు ముందుకు రావాలి

⏭ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు

టీ మీడియా,నవంబర్02,సింగరేణి(కారేపల్లి):
ఉపాధ్యాయులకు మంచి ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీని త్వరలోనే సాధిస్తామని పీఆర్టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు ధీమా వ్యక్తం చేశారు.ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు మెరుగైన పీఆర్సీ సాధనకు పీఆర్టీయూ కృషి చేస్తుందని తెలిపారు.సోమవారం సాయంత్రం పీఆర్టీయూ సింగరేణి మండల శాఖ ఆధ్వర్యంలో కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షుడు బాణోత్ నరసింహ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కట్టా శేఖర్‌రావు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతి



ఉపాధ్యాయుడు,అర్హులైన వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు అర్హుల ఓట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న పీఆర్టీయూ సింగరేణి మండల శాఖ నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.అర్హులైన ఏ ఒక్కరూ ఓటు నమోదుకు దూరం కాకుండా ఉపాధ్యాయ సంఘం నాయకులు కృషి చేయాలని సూచించారు.రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ తరపున సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారని తెలిపారు.ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉన్న ఆయనకు ఉపాధ్యాయులు,పట్టభద్రులు మద్దతు తెలపాలని కట్టా శేఖర్‌రావు కోరారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.వేణుమాధవరావు,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జి.విజయ,అమృత్‌కుమార్,జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా సోమ్లా,జిల్లా కార్యదర్శి వి.విజయలక్ష్మి,కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాల్మన్‌రాజ్,మండల మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ వివాదం



⏭ కలెక్టర్‌కు సీపీఐ ఫిర్యాదు

టి మీడియా, నవంబర్2. ఖమ్మం రూరల్ :

ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పీవీఆర్ గార్డెన్‌లో అక్టోబర్ 31వ తేదీన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ సందర్భంగా చోటుచేసుకున్న వివాదంపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.కు సీపీఐ ఖమ్మం రూరల్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో కలెక్టర్ దివాకర టిఎస్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎదులాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీలో కాంగ్రెస్ నాయకులు వ్యవహరించిన తీరుతో కౌన్సిలర్ల హక్కులకు భంగం కలిగిందని సీపీఐ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కాంగ్రెస్ నాయకులు అధికారుల వద్ద నుంచి ప్రొసీడింగ్ పత్రాలు తీసుకొని పంపిణీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎదులాపురం మున్సిపాలిటీ పర్యవేక్షణ, హౌసింగ్ శాఖ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. వివాదానికి సంబంధించిన ఫొటోలు, వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తా కథనాల క్లిప్పింగులను ఆధారాలుగా కలెక్టర్‌కు సమర్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని పార్టీలకు, అర్హులైన ప్రజలకు సమానంగా అందాల్సి ఉండగా, ఒకే పార్టీకి చెందిన కార్యక్రమంగా వ్యవహరిస్తూ ఇతర పార్టీల నాయకులు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీపీఐ నాయకులు సమర్పించిన ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్, ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలోసిపిఐ పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు మిడి కంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కరరావు, వెంపటి సురేందర్, బానోతు రామకోటి, బూర నాగేశ్వరరావు, పగిళ్ల వీరభద్రం, బట్టు బాబు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏదులాపురం మున్సిపాలిటీ 28 వార్డు కౌన్సిలర్ దండి రంగారావు పాల్గొన్నారు

జీఎస్టీ వసూళ్లలో ఏపీ జోరు



⏭ అక్టోబరులో రూ.4,307 కోట్ల ఆదాయం

టీ మీడియా, నవంబర్ 2 ,అమరావతి బ్యూరో:

జీఎస్టీ వసూళ్లలో ఏపీ జోరు కొనసాగుతోంది. అక్టోబర్ నెలలో రాష్ట్రానికి జీఎస్టీ ద్వారా రూ.4,307 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే 24 శాతం వృద్ధి నమోదైంది. దక్షిణాదిలో కేరళం (23%), కర్ణాటక (18%), తెలంగాణ (14%), తమిళనాడు (3%), పుదుచ్చేరి (–7%)లకంటే ఏపీ అత్యధిక వృద్ధి సాధించింది. జాతీయ స్థాయిలో రాష్ట్రాల సగటు ఆదాయ వృద్ధి 16%గా నమోదైంది. ఎస్‌జీఎస్‌టీ సెటిల్‌మెంట్ తర్వాత ఈ ఏడాది ఇప్పటివరకు ఏపీకి రూ.23,180 కోట్ల (18% వృద్ధి) ఆదాయం వచ్చింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

అక్టోబరులో రూ.2.31 లక్షల కోట్లు

దేశీయంగా అక్టోబరులో జీఎస్‌టీ కింద రూ.2.31 లక్షల కోట్ల ఆదాయం వచ్చినట్లు, గత ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.88 లక్షల కోట్లతో పోలిస్తే 22.9% వృద్ధి నమోదైనట్లు కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. రూ.27,934 కోట్లు రీఫండ్ చేసినట్లు వెల్లడించింది. దసరా సీజన్‌లో వ్యాపార లావాదేవీలు ఊపందుకోవడంతో పన్ను వసూళ్లు పెరిగాయి.

వసూళ్లలో 20% వృద్ధి

వాణిజ్య పన్నుల వసూళ్లలో అక్టోబరుకు సంబంధించి ఏపీలో 20% వృద్ధి నమోదైంది. గతేడాది అక్టోబరులో రూ.4,458 కోట్లు వసూలు కాగా ఈ అక్టోబరులో రూ.5,329 కోట్లు వచ్చినట్లు రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో మౌలిక సౌకర్యాల ప్రాజెక్టులు వేగవంతం కావడంతో నిర్మాణ రంగ జీఎస్టీలో 59.83% వృద్ధి నమోదైందని చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఎ.బాబు తెలిపారు. 2026 ఏప్రిల్ నుంచి అక్టోబరు మధ్య వాణిజ్య పన్నుల వసూళ్లు రూ.35,765 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయానికి రూ.30,351 కోట్లు వసూలయ్యాయి.

లైంగిక దాడి కేసులో ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష..

టీ మీడియా, నవంబర్ 2 ,ఖమ్మం లీగల్:

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.ఈ కేసు దర్యాప్తును రూత్విక్ సాయి (ఐపిఎస్) ఏసీపీ రహేమాన్ నిర్వహించగా, కోర్టులో కేసు విచారణకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. శరత్ కుమార్ రెడ్డి సహకరించారు, కోర్టు కానిస్టేబుల్ వై. నాగేశ్వరావు, లైజన్ అధికారులు ఎస్సై శ్రీకాంత్, ఆర్ నాగేశ్వరావు,హోంగార్డ్ అయూబ్ లు సహకరించారు.

పంటల పై ప్రత్యామ్నాయ ప్రణాళిక

⏭ ఏ ఈ ఓ : రఘు

టీ మీడియా ,నవంబర్ 2 ,కూసుమంచి:

యాసంగి పంటల సాగుపై ప్రత్యేక ప్రణాళికతో రైతుల్లో అవగాహన కల్పించారు. కూసుమించి మండలం లోని చౌటపల్లి, బోడియ తండ గ్రామాల సోమవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి రఘు రైతులతో సమావేశమై ఈ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో రఘు మాట్లాడుతూ యాసంగి పంటలపై ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలపై కలిగే ప్రభావాలు, పంటల సాగులో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, పంట నష్టాలను తగ్గించుకునేందుకు అనుసరించాల్సిన విధానాల గురించి రైతులకు వివరించారు. తక్కువ నీటి లభ్యత, విద్యుత్ కొరత ఏర్పడనున్నందున అందుకు అనుగుణంగా రైతులు స్వల్పకాలిక ఆరుతడి పంటలను



మాత్రమే సాగు చేయాలని ఆయన సూచించారు. ఆరుతడి పంటలైన మినుము, పెసర, జొన్న, కుసుమ, వేరుశనగ, నువ్వులు, కూరగాయలు వంటి పంటలను సాగు చేయాలని రఘు రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

⏭ జిల్లా కలెక్టర్ అంకిత్

టీ మీడియా, నవంబర్ 2 , పాల్వంచ:

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిపై తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. ఒక శాఖకు సంబంధించిన సమస్య పరిష్కారానికి ఇతర శాఖల సహకారం అవసరమైనప్పుడు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరిష్కరించిన అర్జీల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు, దరఖాస్తుదారులకు పరిష్కార సమాచారం అందించాలని ఆదేశించారు

కొన్ని దరఖాస్తుల వివరాలు:

పాల్వంచ మండలానికి చెందిన వై. నాగలక్ష్మి తనకు గతంలో ఉన్న రేషన్ కార్డును అధికారులు కారణం లేకుండా రద్దు చేశారని కలెక్టర్‌కు విన్నవించారు. తన భర్త ఎనిమిదేళ్ల



క్రితం మృతి చెందారని, కుటుంబ పోషణకు రేషన్ కార్డు ఎంతో అవసరమని, రద్దు చేసిన రేషన్ కార్డును తిరిగి మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును డీసీఎస్ఓకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.అశ్వారావుపేట మండలం నందిపాడు ప్రాంతానికి చెందిన బత్తుల జానకమ్మ తనకు గతంలో అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద రేషన్ అందేదని, ప్రస్తుతం రేషన్ నిలిపివేశారని తెలిపారు. తాను వితంతువునని, సంతానం కూడా లేదని, తిరిగి ఏఏవై రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును డీసీఎస్ఓకు ఎండార్స్ చేశారు.లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని చాతకొండ ఎస్సీ కాలనీకి చెందిన మేక రజని తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన తాము రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, పనులు సరిగా లభించక అద్దె చెల్లించడం, కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారిందని అన్నారు . తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరగా, ఈ దరఖాస్తును తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సఫాయి బస్తీకి చెందిన మహమ్మద్ జరీనా బేగం తాను పోలియో బాధితురాలినని, 2023లో ప్రభుత్వం అమలు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ద్వారా తనకు ప్లాట్ నంబర్ 602 కేటాయించినట్లు తెలిపారు. అద్దె భారం కారణంగా మరో ప్రాంతానికి మారిన సమయంలో అధికారులు తనఖీకి వచ్చినప్పుడు సరైన సమాచారం అందకపోవడంతో తనకు కేటాయించిన ఇంటిని రద్దు చేశారని వివరించారు. తనకు గతంలో కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని తిరిగి మంజూరు చేయాలని కోరగా, ఈ దరఖాస్తును పీడీ హౌసింగ్‌కు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పై కార్యాచరణ

⏭ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

టీ మీడియా, నవంబర్ 2 , ఖమ్మం:

వేసవి కాలం, ఎల్‌నినో ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, జిల్లాలోని అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్, డబ్ల్యూఎస్ఎమ్ ఛైర్మన్ దివాకర టి ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరా మౌళిక సదుపాయాలపై, అడిగిన వారికి పని కల్పన పై కలెక్టర్, జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 21 మండలాల్లో నవంబర్ 09 నుండి నవంబర్ 14 వరకు మండల స్థాయి సమావేశాలను నిర్వహించాలన్నారు. ఇట్టి సమావేశాలలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు మరియు సాంకేతిక సిబ్బంది వంద శాతం భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ (ఇంట్రా డ గ్రిడ్) ఎఈఈ/ఎఈ, ఎంపీఓ, సర్పంచ్‌లు, కార్యదర్శులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతి వీధిలో 24–పాయింట్ల చెక్‌లిస్ట్ ఆధారంగా క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు ముందే హ్యాండ్ పంపులు, సింగిల్/త్రీ–ఫేజ్ మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల శుభ్రత, క్రిమిసంహారక చర్యలు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 3



నెలలకు సరిపడా బ్లీచింగ్ పౌడర్ బఫర్ స్టాక్ నిల్వ ఉంచాలని తెలిపారు. తక్కువ వర్షపాతం, నీటిమట్టం పడిపోవడం లేదా స్థానిక బోరుబావులు ఎండిపోయిన ప్రాంతాలను గుర్తించి, నీటి ఎద్దడి రాకుండా గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన చోట నిబంధనల ప్రకారం ప్రైవేట్ వ్యవసాయ బావులను అద్దెకు తీసుకోవడానికి ముందస్తు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీటి శుద్ధి కేంద్రాలు, ఇంటేక్ బావులు, పంపింగ్ స్టేషన్లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, కనీస నీటి మట్టాలను నిర్వహించాలని తెలిపారు. అలాగే అన్ని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో 3 నెలలకు సరిపడా ఆలమ్/పిఏసి, క్లోరిన్ నిల్వలు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్–ఫ్రీ నంబర్ 1916 పై ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నోటీసు బోర్డులు, డప్పు చాటింపులు, స్థానిక వార్డు గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. రోజువారీ నివేదికలను సేకరిస్తూ, వారపు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి కలగకుండా చూడాలని కలెక్టర్ హెచ్చరించారు.అడిగిన వారికి పనిదినాలు కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, ఎంపీడీవో లు, ఎంపీవోలు, మిషన్ భగీరథ ఏఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళ మురళిని వెంటనే అరెస్ట్ చేయాలి!

● కలెక్టరేట్ ఎదుట జేబీపీ ప్లకార్డులతో నిరసన

టీ మీడియా, నవంబర్ 2 , కలెక్టరేట్:



కొత్తగూడెంలో రూ.6.91 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టిన కేసులో ఏ–1 ముద్దాయిగా పేర్కొన్న ఆళ్ళ మురళిని వెంటనే అరెస్ట్ చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణ మూడో పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 202/2026గా నమోదైన కేసులో ఆళ్ళ మురళి ఏ–1గా ఉన్నారని తెలిపారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, తిరిగి ప్రభుత్వానికి బియ్యం అప్పగించాల్సి ఉండగా, రెండు ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన రూ.6.91 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఇంతటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు.గతంలో 2021, 2022 సంవత్సరాల్లోనూ ఇదే తరహా ధాన్యం మళ్లింపు వ్యవహారంలో మూడు నెలల క్రితం రూ.2 కోట్లు చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. ధాన్యం సేకరణ అనంతరం రెవెన్యూ అధికారులు ప్రతి 15 రోజులకు ఒకసారి ఫిజికల్ వెరిఫికేషన్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, రెండేళ్లుగా భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు.జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ధాన్యం పక్కదారి పట్టిన వ్యవహారంలో బాధ్యులైన వారితో పాటు, ఇందుకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆళ్ళ మురళిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని డిమాండ్ చేశారుఈ నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, శంకర్, రాంబాబు, కవిత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వాయిదాల మీద వాయిదాలు..



● మిగిలింది రెండేళ్లే..

● కొలిక్కిరాని నామినేటెడ్ పోస్టుల భర్తీ

టీ మీడియా, నవంబర్ 2, హైదరాబాద్:

అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా కాంగ్రెస్ పార్టీలో పదవుల పంపకం మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో కొలిక్కి రావడం లేదు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్న ఆశలు రోజురోజుకూ సన్నగిల్లుతున్నాయి. పండుగల పేరుతో పదవుల భర్తీని వాయిదా వేస్తున్నారనే విమర్శలు పార్టీ శ్రేణుల్లో బలంగా వినిపిస్తున్నాయి. సంక్రాంతి తర్వాత, ఉగాది తర్వాత, దసరా తర్వాత అంటూ కాలం గడుస్తున్నా ఆశావహులకు మాత్రం పదవులు దక్కడం లేదు. ఇప్పుడు దీపావళి తర్వాతైనా నియామకాలు జరుగుతాయా? లేక మరోసారి వాయిదా పడతాయా? అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పలుమార్లు పదవుల భర్తీపై ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన వారికి అవకాశాలు కల్పించకుండా జాప్యం చేయడం వల్ల క్షేత్రస్థాయిలో కార్యకర్తల ఉత్సాహం తగ్గుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

అధిష్టానం దృష్టి ఢిల్లీ రాజకీయాలపైనేనా?

ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ అధిష్టానం కీలక పరిణామాలతో బిజీగా ఉంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం వ్యవహారాలపై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పోరాటం కొనసాగిస్తోంది. మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సహా పలువురు అగ్రనేతలు జాతీయ రాజకీయ అంశాలపై దృష్టి సారిస్తున్నారు. తెలంగాణకు చెందిన కీలక నాయకులు కూడా ఢిల్లీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణతోపాటు పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల భర్తీకి అధిష్టానం ఎప్పుడు ఆమోదం తెలుపుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర మంత్రివర్గంలో మూడు బెర్తులు ఖాళీగా ఉండగా, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు, ప్రచార కమిటీ చైర్‌పర్సన్ పదవి, పీసీసీ కార్యవర్గంలోని పలు కీలక స్థానాలు కూడా భర్తీ కావాల్సి ఉంది. పార్టీ అనుబంధ విభాగాలకు సైతం పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

87 నామినేటెడ్ పోస్టులు.. వేలాది మంది ఆశలు!

నామినేటెడ్ పదవుల భర్తీ కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాలుగా మారింది. ఇటీవల సుమారు 37 మందికిపైగా చైర్మన్ల పదవీకాలం ముగియడంతో ఆయా సంస్థల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటితోపాటు అదనంగా మరో 50 పదవులను కలిపి మొత్తం 87 వరకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలనే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఆర్టీసీ కార్పొరేషన్, సివిల్ సప్లయ్స్, హౌసింగ్ కార్పొరేషన్, మూసీ రివర్‌ఫ్రంట్, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ, మత్స్య సహకార సంఘాల సమాఖ్య, ఆగ్రో ఇండస్ట్రీస్, పర్యాటకాభివృద్ధి సంస్థ, ఫుడ్స్ కార్పొరేషన్, రెడ్‌కో, గిడ్డంగుల సంస్థ, ఖనిజాభివృద్ధి సంస్థ, అటవీ అభివృద్ధి సంస్థ, ఆయిల్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, రోడ్డు అభివృద్ధి సంస్థ, ఎంబీసీ కార్పొరేషన్, రైతు కమిషన్, క్రీడా ప్రాధికార సంస్థతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లలో నియామకాలు చేపట్టాల్సి ఉంది.కేవలం చైర్మన్ పదవులే కాకుండా వైస్ చైర్మన్లు, డైరెక్టర్ల నియామకాలు కూడా చేపడితే పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవకాశం కల్పించవచ్చు. తద్వారా వివిధ సామాజిక వర్గాలకు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు పార్టీ క్యాడర్‌లో నెలకొన్న అసంతృప్తిని కొంతవరకు తగ్గించవచ్చని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

ఆరోగ్య భీమాను చెల్లించాలి

టీ మీడియా, నవంబర్ 2 ,ఖమ్మం లీగల్:

ఆరోగ్య భీమా పథకం పాలసీలో వినియోగదారుల అనారోగ్య బాధితునికు వైద్య ఖర్చులభీమా పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాలపరిష్కార కమిషన్ చైర్మన్ జాబేజ్ శామ్యూల్, సభ్యురాలు వి. లలిత, ఎ.మాధవీలతతీర్పునిచ్చారు.కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాదుదారు ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రాపల్లి గ్రామానికి చెందిన తోట రామాంజనేయులు తాను తనకుటుంబ సభ్యులు కలిసి కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ఆరోగ్య భీమాపథకం పాలసీ 2024 సంవత్సరం పాలసీ తీసుకొని గత ఏడాది కూడా పాలసీనిరెన్యువల్ చేసుకున్నారు. అందుకుగాను ప్రీమియం చెల్లింపులు కోసం రూపాయలు13,105/– ను చెల్లించారు. ఇన్సూరెన్స్ వారు కంపెనీ వారు సంవత్సర కాలంలోఎటువంటి అనారోగ్య పరిస్థితి ఏర్పడిన ఐదు లక్షల రూపాయలుపరిమితిచెల్లించలని క్యాష్ లెస్ పాలసీ తీసుకున్నారు. పాలసీ కాలంలోదురదష్టవశాత్తూ తన కుమారుడు తోట రిత్విక్ అనారోగ్యం పాలు కావడంతో ఆస్పత్రిలోజాయిన్ చేపించారు. ఖమ్మం లోని ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించి వైద్య పరీక్షలునిర్వహించారని ఫిర్యాదుదారు కేసులోపేర్కొన్నారు. సదరు ఫిర్యాదుదారువెంటనే ఇన్సూరెన్స్ కంపెనీవారిని సంప్రదించగా క్యాష్ లెస్ సదుపాయాన్నినిరాకరించారు. తదుపరి వైద్యానికైనా ఖర్చులను. అంబులెన్స్ ఖర్చులను, తదితరబిల్లును కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ వారికి పంపగా అక్కడ కూడాబీమాను నిరాకరించినారని తమ న్యాయవాదులు ద్వారా కేసు నమోదు చేశారు. తమహెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రకారం తనకు ఆసుపత్రిలో వైద్యానికిఅయిన ఖర్చులను చెల్లించవలసిందిగా సదరు ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించగావారు బీమా క్లైమ్ ను నిరాకరించారని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాలపరిష్కార కమిషన్ కుఫిర్యాదుదారులు తమ న్యాయవాదులు వెల్లంపల్లి నరేంద్రస్వరూప్, కొలికొండ.శరత్ బాబు న్యాయవాదులు ద్వారా నివేదించారు. ఫిర్యాదుదారు కు 45 రోజుల్లోపుచెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పునిచ్చారు.

బీజేపీలో చేరిన ముగ్గురు పంజాబ్ ఆప్ ఎమ్మెల్యేలు

టీ మీడియా, నవంబర్ 2, న్యూఢిల్లీ:

పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఇవాళ బీజేపీలో చేరారు. ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో చేరిక కార్యక్రమం జరిగింది. హర్మీత్ సింగ్ పాఠానమజ్రా, చేతన్ సింగ్ జౌరామజ్రా, కున్వార్ విజయ్ ప్రతాప్‌లు.. పంజాబ్ బీజేపీ ఇంచార్జీ సతీశ్ పూనియా సమక్షంలో బీజేపీలో చేరారు. కో–ఇంచార్జీ విరేంద్ర సచ్‌దేవ్, రాష్ట్ర బీజేపీ చీఫ్ కేవాల్ సింగ్ ధిల్లాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ జిందాబాద్



అని ఆ ముగ్గురు నినాదాలు చేశారు. పంజాబ్ తన అస్థిత్వం కోసం పోరాడుతోందని, పంజాబ్ సింధు గుజరాత మరాఠ అని పంజాబ్‌కు ఎంతో గౌరవం ఇచ్చారని, కానీ ఇప్పుడు రాష్ట్రం దయనీయంగా మారిందని, గత అయిదేళ్ల నుంచి ఆమ్ ఆద్మీ పార్టీతో తాను ఇంటెర్నిషిప్‌లో ఉన్నట్లు కున్వర్ విజయ్ ప్రతాప్ తెలిపారు. పంజాబ్‌ను ఉడ్తా పంజాబ్ అని పిలుస్తున్నారని, ఆమ్ ఆద్మీ పార్టీ 2.5 లక్షల కోట్ల రుణాలు తీసుకున్నదని, రాష్ట్రాన్ని నాశనం చేశారని హర్మీత్ సింగ్ ఆరోపించారు. ప్రధాని మోదీ తన వాగ్దానాలను నెరవేర్చారని, అందుకే తాను ఆప్‌ను వీడి బీజేపీలో చేరినట్లు చేతన్ సింగ్ పేర్కొన్నారు.

అండాల అక్రమ సేకరణ కేసు

నగరంలోని 5 ఐవీఎఫ్ కేంద్రాల సహకారం



టీ మీడియా, నవంబర్ 2,హైదరాబాద్ బ్యూరో:

పేద మహిళలకు డబ్బు ఆశచూపి అక్రమంగా అండాలు సేకరించిన కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. విచారణలో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న కొన్ని సంతాన సాఫల్య కేంద్రాల చీకటి దందా బయటపడుతోంది. కేసులో ప్రధాన నిందితుడు మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్ శర్మ ఇతర రాష్ట్రాల నుంచి యువతులు, మహిళల్ని తీసుకొస్తుండగా, ఆ తర్వాత తంతు ఐవీఎఫ్ కేంద్రాలు పూర్తి చేస్తున్నాయని పోలీసులు భావిస్తున్నారు.

5 ఐవీఎఫ్ కేంద్రాలు వెలుగులోకి

హైదరాబాద్‌లో చట్ట విరుద్ధంగా అండాల సేకరణ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు. హబ్సిగూడ, బంజారాహిల్స్, ఎల్బీనగర్ ప్రాంతాల్లోని 5 సంతాన సాఫల్య కేంద్రాల పేర్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. ఐవీఎఫ్ కేంద్రాలు అండాల సేకరణకు సహకరించాయా? నిందితులతో సంబంధాలున్నాయా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులకు లేఖ రాసిన పోలీసులు చట్టబద్ధత ఏంటో తేల్చాలని కోరారు. ఒకవేళ అండాలు అక్రమంగా సేకరించినట్లు, నిందితులకు సహకరించినట్లు తేలితే ఐవీఎఫ్ కేంద్రాలపైనా కేసు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

9 రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించి

అక్రమ అండాల సేకరణ కేసులో ఇప్పటికే 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన అమిత్ శర్మ నేతృత్వంలోని ముఠా దేశవ్యాప్తంగా దాదాపు 9 రాష్ట్రాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అందులో తొలుత పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర బాధితులే ఉన్నట్లు పోలీసులు భావించారు. దర్యాప్తులో భాగంగా బిహార్, దిల్లీ, అస్సాం, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన బాధితులు ఉన్నట్లు తేలింది.

ఆయా రాష్ట్రాల్లోని ఏజెంట్లు, యువతులు, మహిళలకు డబ్బు ఆశచూపి హైదరాబాద్ తీసుకొచ్చేలా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించారు. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని వసతి గృహం, సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలోని రెండు నివాసాల కేంద్రంగా సుమారు 350 మంది నుంచి అండాలు తీసుకున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. రక్షించిన 43 మంది మహిళల నుంచి పోలీసులు వాంగ్మూలాలు సేకరించారు.

వైద్యుల ప్రమేయం ఉందా?

ఇప్పటికే వైద్యారోగ్య శాఖ అధికారులు, పోలీసులు బేగంపేట, సరూర్‌నగర్‌లోని 3 ప్రాంతాలను తనిఖీ చేశారు. నిందితులు అండాల సేకరణకు వైద్యారోగ్యశాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని తేలింది. కొందరు వైద్యుల ప్రమేయం అందులో ఉంటుందన్న కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల్లో నేర చరిత్ర ఉన్న పంకజ్‌సోనీ గతంలో అక్రమంగా వీర్యం సేకరించిన కేసులో నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.

తల్లి, భార్య, ఇద్దరు పిల్లలను చంపి



● రైలు ముందు దూకి వ్యక్తి ఆత్మహత్య

టీ మీడియా, నవంబర్ 2,భోపాల్:

ఒక వ్యక్తి తన తల్లి, భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేశాడు. ఆ తర్వాత రైలు పట్టాల వద్దకు వెళ్లాడు. రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించడంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం ఛోలా ప్రాంతంలోని ఒక ఇంట్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పిల్లలు విగతజీవులుగా కనిపించారు. రైలు పట్టాల వద్ద ఒక వ్యక్తి మృతదేహం లభించింది. ఆ ఐదుగురూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. 35 ఏళ్ల నరేంద్ర సాహూ తన తల్లి అయిన 55 ఏళ్ల సరస్వతి, 29 ఏళ్ల భార్య సోమలత, పదేళ్ల కుమార్తె కృతి, ఆరేళ్ల కుమారుడు ఖుషీను ఇంట్లో చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు, రైలు పట్టాల వద్ద రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. వారి మరణంపై కేసు నమోదు చేశారు. నరేంద్ర తన కుటుంబ సభ్యులను చంపి ఆత్మహత్యకు పాల్పడటానికి కారణం ఏమిటన్నది దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు ముందు ఆ ఇంట్లో ఏం జరిగిందో అన్నది తేలిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశమున్నదని పోలీస్ అధికారి తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.